నమస్తే తెలంగాణ
# రాజన్న సిరిసిల్ల
10 | కరీంనగర్, ఆదివారం 12 మే 2024 | RAJANNA SIRCILLA

## బీజేపీ, కాంగ్రెస్‌ను నమ్మితే అల్లకల్లోలమే



గోదావరిఖనిలో తీసిన ర్యాలీలో మాట్లాడుతున్న పెద్దపల్లి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్, పక్కన మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్

- బీఆర్ఎస్సే ప్రజలకు శ్రీరామ రక్ష
- సింగరేణి ప్రైవేట్‌పరం కాకుండా అడ్డుకుంటం
- కార్మికుల ఐటీ మినహాయింపునకు కృషి చేస్తం
- పెద్దపల్లి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్

గోదావరిఖని, మే 11 : పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్‌ను నమ్మితే తెలంగాణ అల్లకల్లోలమే అవుతుందని, ఆ పార్టీలు సింగరేణి సంస్థను పూర్తిగా అమ్మేందుకు పూనుకుంటాయని పెద్దపల్లి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వ వ్యతిరేక విధానాలతో అవస్థ పడుతున్న ప్రజలకు బీఆర్ఎస్ శ్రీరామ రక్షగా ఉంటుందని స్పష్టం చేశారు. తెలంగాణ అస్తిత్వాన్ని ప్రజలు కాపాడుకోవాలని, నిరంతరం ప్రజా సేవ కోసం తపించే తనను ఎంపీగా గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. తాను గెలిస్తే సింగరేణి కార్మికుల సంక్షేమం కోసం పని చేస్తానని, కార్మికులకు ఐటీ మినహాయింపు కోసం కృషి చేస్తానని, సంస్థను ప్రైవేట్‌పరం కాకుండా అడ్డుకుంటామని హామీ ఇచ్చారు. తన చివరి శ్వాస వరకు ప్రజల సేవకే తన జీవితం అంకితమని స్పష్టం చేశారు. శనివారం గోదావరిఖని మున్సిపల్ కార్యాలయం సమీపంలోని టీ జంక్షన్ నుంచి తీసిన బైక్ ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆ తర్వాత ఖని ప్రధాన చౌరస్తాలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయాచోట్ల మాజీ ఎమ్మె ల్యే కోరుకంటి చందర్‌తో కలిసి కొప్పుల మాట్లాడారు. బీఆర్ఎస్ ఎల్లప్పుడూ తెలంగాణ అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసమే పనిచేస్తుందని స్పష్టం చేశారు. ప్రజల పక్షాన కాంగ్రెస్ వ్యతిరేక విధానాలకు ఎదురు నిలిచి పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. అబద్ధాలు, అమలు కాని గ్యారంటీలతో ఆ పార్టీ గద్దెనెక్కిందని, ఇప్పుడా ఆ హామీలను అమలు చేయలేక అబాసుపాలవుతున్నదని విమర్శించారు. ఈ ప్రభుత్వంపై ప్రజలు వ్యతిరేకతతో ఉన్నారని చెప్పారు. ఇప్పటికైనా ప్రజలు కాంగ్రెస్ పాలనపై అవగాహనకు రావాలని సూచించారు. స్థానికుల కష్టాలు తెలిసిన.. కార్మికుల బాధలు తెలిసిన తనకు అవకాశం ఇవ్వాలని కోరారు. కోరుకంటి చందర్ మాట్లాడుతూ. ఉద్యమకారుడు, సింగరేణి మాజీ కార్మికుడు కొప్పుల ఈశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమాల్లో పార్టీ నాయకులు మిర్యాల రాజిరెడ్డి, రామ్మూర్తి, చల్ల రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

## నిజం కేసీఆర్ విషం బీజేపీ అబద్ధం కాంగ్రెస్

# ఎవరు కావాలో మీరే తేల్చుకోవాలి

బీఆర్ఎస్ పాలనలోనే సబ్బండ వర్గాలకు మేలు

హుజూరాబాద్ రోడ్ షోలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్





రోడ్‌షోలో ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, పక్కన కరీంనగర్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి వినోద్‌కుమార్, ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి

హుజూరాబాద్/ హుజూరాబాద్ టౌన్, మే11: పదేండ్ల బీజేపీ పాలన విషంతో సమానమని, 150 రోజుల కాంగ్రెస్ పాలన అబద్ధాలమయమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్యే కేటీఆర్ ధ్వజమెత్తారు. పదేండ్ల కేసీఆర్ పాలన నిజమని స్పష్టం చేశారు. ఎవరు కావాలో ప్రజలు తేల్చుకోవాలని, తమకు అండగా నిలిచే బీఆర్ఎస్ అభ్యర్థి వినోద్ కుమార్‌కు ఓటేయాలని విజ్ఞప్తి చేశారు. కేసీఆర్ ఉన్నప్పుడే బాగుండే అనుకునే వాళ్లంతా 10 నుంచి 12 ఎంపీ సీట్లు ఇస్తే ఆరు నెలల్లో మళ్లీ కేసీఆర్ రాష్ట్ర రాజకీయాలను శాసిస్తాడని జోస్యం చెప్పారు. బీజేపీ పాలనలో ఏ ఒక్క మంచి పనీ జరగలేదని, ఆచరణ సాధ్యంకాని హామీలు ఇచ్చి గద్దెనెక్కిన కాంగ్రెస్ ఇప్పుడు అన్నీ ఝూటా మాటలు మాట్లాడుతున్నదని ధ్వజమెత్తారు. హైదరాబాద్‌ను యూటీ చేసే కుట్ర కూడా చేస్తున్నారని, అందుకే పార్లమెంట్‌లో గల్లా పట్టి అడిగే ఎంపీలు ఉండాలని చెప్పారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం హుజూరాబాద్‌లో రోడ్ షో నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, బీఆర్ఎస్ అభ్యర్థి బీ వినోద్‌కుమార్‌తో కలిసి కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అశేషంగా తరలివచ్చిన ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. కేసీఆర్ పాలనలో సబ్బండవర్గాలకు మేలు జరిగిందని, అభివృద్ధిలో తెలంగాణ ఆదర్శంగా నిలిచిందని చెప్పారు. బీజేపీ పాలనలో ఏ వర్గానికి మేలు జరగలేదని, దేశంలోనే చేనేతపై జీఎస్టీ వేసిన మొదటి ప్రధాని మోడీనేనని మండిపడ్డారు. అలాగే నిత్యావసరాల ధరలు పెంచి, సామాన్యులపై భారం మోపుతున్నాడని ఆగ్రహించారు. పదేళ్లు ఏం చేసినవయ్యా అంటే చెప్పడానికి వాళ్లకు ఏమీ లేదని, అందుకే గుడికట్టినం అని చెప్పుకుంటున్నారన్నారు. మనం కూడా గుడి కట్టినమని, కేసీఆర్ యాదాద్రిని కట్టలేదా? గుడి మాత్రమే కాదు, ఆధునిక దేవాలయాలైన కాళేశ్వరం ప్రాజెక్టును కూడా కట్టిండని గుర్తు చేశారు. రేవంత్‌రెడ్డి వచ్చి మస్తు ఉత్తముచ్చట్లు నరికిండని విమర్శించారు. రైతు భరోసా, రైతు రుణమాఫీ, ₹500 బోనస్, 2 లక్షల ఉద్యోగాలు, తులం బంగారం, స్కూటీలు, మహిళలకు ₹2500, పెద్ద మనుషులకు ₹4 వేలు అని చెప్పి ఒక్కటీ అమలు చేయలేదని మండిపడ్డారు.

### పిచ్చి మాటల బండి మనకెందుకు?

ఎంపీ అంటే రాష్ట్రానికి పైసలు తేవాలె. అభివృద్ధి చేయాలె. కానీ, బండి సంజయ్ ఐదేళ్లలో ఏం చేసిండు? హిందూ ముస్లిం మధ్య పంచాయితీ పెట్టుడు, అమిత్ షా చెప్పులు మోసుడు తప్ప ఏమీ లేదు. ఎక్కడైనా ఆయన చేసిన అభివృద్ధి కనిపించిందా? ఏమన్నా అంటే ఆయన రాముడు గురించి మాట్లాడుతడు. రాముడంటే మాకు కూడా భక్తి ఉన్నది. అసలు బీజేపోళ్లే మనకు కట్టు, బొట్టు, పండుగలు నేర్పించినట్టు బిల్డప్‌లు ఇస్తున్నరు. ఆ పార్టీ లేకుంటే దేవుడే లేనట్టు ప్రజలను మభ్యపెడుతున్నరు. గాలి తిరుగుడు తిరుగుతూ, పిచ్చి మాటలు మాట్లాడే బండి సంజయ్ మనకెందుకు? చదువుకున్న వ్యక్తి, ఈ ప్రాంతం కోసం కొట్లాడే వినోదన్ననే గెలిపించాలి.

**- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**

### కరీంనగర్‌కు సంజయ్ చేసిందేమిటి?

కాంగ్రెస్ మోసం చేసి గెలిచింది. ఆచరణ సాధ్యంకాని హామీలు ఇచ్చి ప్రజలను నిండా ముంచింది. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాష్ట్రానికి చేసిందేమీ లేదు. కాశీ ఎంపీగా ఉన్న మోడీ దక్షిణ కాశీగా ప్రసిద్ధిచెందిన వేములవాడకు ఎందుకు నిధులు కేటాయించలేదు. ఇక బండి సంజయ్ ఈ ప్రాంతానికి నిధులు కేటాయించాలని మోడీని ఒక్కనాడు అడిగిన పాపాన పోలేదు. ఆయన కరీంనగర్‌కు చేసిందేంటి? ఇప్పుడు బీజేపీ హైదరాబాద్‌ను యూటీగా మార్చే కుట్రలు చేస్తున్నది. దానికి ఈ రాష్ట్ర ముఖ్యమంత్రి వత్తాసు పలుకుతున్నడు. తెలంగాణకు జరుగుతున్న అన్యాయంపై పార్లమెంట్‌లో కొట్లాడాలంటే బీఆర్ఎస్ ఎంపీలు ఉండాలి. ప్రజలంతా విజ్ఞతతో ఆలోచించి నన్ను ఎంపీగా గెలిపించాలి.

**- బీ వినోద్‌కుమార్, కరీంనగర్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి**



మాట్లాడుతున్న వినోద్‌కుమార్, చిత్రంలో ఎమ్మెల్యే గంగుల, ఎమ్మెల్సీ భానుప్రసాద్ రావు

# అభివృద్ధా.. విధ్వంసమా..?

ఏది కావాలో ప్రజలే ఆలోచించాలి

- అబద్ధపు హామీలతో కాంగ్రెస్ మోసం
- ఐదేళ్లలో బీజేపీ చేసిందేమీలేదు
- అభివృద్ధే లక్ష్యంగా పనిచేసే బీఆర్ఎస్‌ను గెలిపించండి
- బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వినోద్‌కుమార్

కార్పొరేషన్, మే 11: కరీంనగర్ లోక్‌సభ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసే వారు కావాలో.. విధ్వంసం సృష్టించే వారు కావాలో? ప్రజలే ఆలోచించాలని కరీంనగర్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి బోయినపల్లి వినోద్ కుమార్ సూచించారు. రేపటి ఎన్నికల్లో ఆలోచించి ఓటు వేయాలని, పదేళ్లలో ఆదర్శంగా తీర్చిదిద్దిన బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. బడే మియా, చోటే మియా కలిసి హైదరాబాద్‌ను యూటీ చేసే ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. ఇలాంటి వాటిని అడ్డుకోవాలంటే బీఆర్ఎస్ ఉండాలని స్పష్టం చేశారు. బండి సంజయ్ వీటిపై మాట్లాడుతారా? అని ప్రశ్నించారు. వారి పార్టీ సిట్ అంటే సిట్.. స్టాండ్ అంటే స్టాండ్ అవుతారని దుయ్యబట్టారు. కరీంనగర్‌లోని ప్రతిమ హోటల్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. లోక్‌సభ నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికీ వెళ్లామని, ప్రజల నుంచి అపూర్వ స్పందన వచ్చిందన్నారు. మళ్లీ కారు రావాలన్న నినాదం రాష్ట్ర వ్యాప్తంగా వినిపిస్తున్నదని తెలిపారు. మార్పు అంటే ఏదో మంచి జరుగుతుందని అనుకున్నాం కానీ, ఐదు నెలల్లో ఇంత అధ్వానంగా అవుతుందని అనుకోలేదని, కాంగ్రెస్ మాటలు నమ్మి మోసపోయామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ఈ ఎన్నికల్లో గులాబీ జెండా ఎగురుతుందని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ తమకు పోటీ కాదని, బీజేపీ తప్పుడు ప్రచారాలు చేస్తున్నదని దుయ్యబట్టారు. కరీంనగర్‌లో ఇప్పుడు అభివృద్ధి ఆగిపోతే మరో 20 ఏండ్లు వెనక్కి పోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. అభ్యర్థి ఫొటో లేకుండా కరపత్రాలను పంచుతున్నది ఒక్క బండి సంజయ్ మాత్రమేనని, అందులో మోడీ ఫొటో మాత్రమే ఉందన్నారు. ఏ అభివృద్ధి గురించి మాట్లాడని సంజయ్‌కు ప్రజలు ఎందుకు ఓటు వేయాలని వినోద్‌కుమార్ ప్రశ్నించారు. ఆయన అభివృద్ధి కోసం ప్రధానిని ఎన్నిసార్లు కలిశారో చెప్పాలని డిమాండ్ చేశారు. కేవలం పార్టీ సమావేశాల్లో తప్ప ఏ రోజు కూడా కలిసింది లేదన్నారు. తాను ఎంపీగా ఉన్నప్పుడు మోడీని అనేకసార్లు నియోజకవర్గ అభివృద్ధి పనుల కోసం కలిశానని, రాష్ట్ర సాధన కోసం అప్పటి ప్రధాని మన్మోహన్‌సింగ్‌ను కలిశానని ఫొటోలు చూపించారు. కానీ, సంజయ్ మాత్రం కనీసం ఒక్క కేంద్ర మంత్రిని కూడా కలిసిన దాఖలాలు లేవన్నారు. పైగా ఇటీవల ప్రధాని మోడీ ఎన్నికల ప్రచారం కోసం వేములవాడకు వస్తే.. ఆయన మాత్రం 75 ఏండ్లలో రాజన్న దర్శనానికి ఏ ప్రధాని అయినా వచ్చారా..? అంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నాడని మండిపడ్డారు. ఈ ప్రచారాలతో మాజీ ప్రధానులను అవమానిస్తున్నాడని, ఇక్కడి దాకా వచ్చిన మోడీని కనీసం కరీంనగర్‌కు ఇది కావాలని కూడా అడుగలేకపోయిండని విమర్శించారు. ప్రధాని ఏమీ ఇవ్వలేదని తాము అంటే ఎన్నికల కోడ్ ఉందని చెబుతున్నాడని, కోడ్ ఉన్నా ఇది చేస్తామని హామీ ఇవ్వచ్చు కదా అన్నారు. సమావేశంలో ఎమ్మెల్సీ భానుప్రసాద్, నగర మేయర్ యాదగిరి సునీల్‌రావు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ తుల ఉమ, మాజీ మేయర్ రవీందర్‌సింగ్, రాష్ట్ర కార్పొరేషన్ల మాజీ చైర్మన్లు గెల్లు శ్రీనివాస్, అక్బర్‌హుస్సేన్, బీఆర్ఎస్ నాయకులు రూప్‌సింగ్ పాల్గొన్నారు.

### గెలిపిస్తే విద్యాహబ్‌గా తీర్చిదిద్దుతా

తనను గెలిస్తే యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తా. అంతర్జాతీయ నైపుణ్య శిక్షణ కేంద్రాన్ని తీసుకొస్త. కేంద్రంలో ఏ ప్రభుత్వం ఉన్నా నిధులు తెస్త. ఇప్పటికే రెండు జాతీయ రహదారులను తెచ్చిన. పనులు నడుస్తున్నయి. మరో మూడు జాతీయ రహదారులు పనులు తీసుకొస్త. రాజీవ్ రహదారిని ఎక్స్‌ప్రెస్ వేగా మారుస్త. కరీంనగర్‌ను విద్యాహబ్‌గా తీర్చిదిద్దుత. ఈ నెల 13న ఓటింగ్‌లో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలి.

**- పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి వినోద్ కుమార్**

### అభివృద్ధి కోసం వినోద్‌ను గెలిపించాలి

రాష్ట్రం నుంచి నేను, కేంద్రం నుంచి వినోద్ నిధులు తెస్తేనే నగరం మరింత వేగంగా అభివృద్ధి సాధిస్తుంది. పదేళ్లలో వినోద్, నేను నగరాన్ని అద్భుతంగా తీర్చిదిద్దినం. ఈ అభివృద్ధి మరింత ముందుకు సాగాలంటే నాకు తోడుగా వినోద్‌కుమార్‌ను ఎంపీగా గెలిపించాలి. మేమెప్పుడూ అభివృద్ధి గురించి మాత్రమే ఆలోచన చేస్తం.

**- కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్**

